GSTIN-NO:36FKPSI308PIZX

epaper:tmedia.net.in

# టి-మీడియా

సామాజికం... ప్రజల పక్షం

మెయిన్

సంపుటి : 7 | సంచిక : 230 | ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ | శనివారం 15-02-2025 | పేజీలు : 3



## హైకోర్టుకు ముగ్గురు శాశ్వత న్యాయమూర్తులు

- ప్రమాణం చేయించిన సీజే సుజయ్ పాల్

**టి మీడియా, ఫిబ్రవరి 14,హైదరాబాద్ బ్యూరో :**

తెలంగాణ హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా పని చేస్తున్న ముగ్గురు శాశ్వత న్యాయమూర్తులుగా నియామమయ్యారు. జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి, జస్టిస్ సుజనను శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. వారితో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేయించారు. ముగ్గురు న్యాయమూర్తులు 2023 జూలై 31న అదనపు న్యాయమూర్తులుగా బాధ్యతలు చేపట్టారు. వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించేందుకు ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసు చేసిన విషయం విధితమే. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసులను పరిగణనలోకి తీసుకున్న కేంద్రం ఆ ముగ్గురిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ఈ క్రమంలో మొదటి కోర్టు హాలులో తాతాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజయ్ పాల్ ప్రమాణస్వీకారం చేయించారు.

# ఏఐసీసీలో మార్పులకు కసరత్తు

- ప్రియాంకకు కీలక పదవి..?

**టీ మీడియా, ఫిబ్రవరి 14,ఢిల్లీ:**

వరుస ఓటములతో సతమతమవుతున్న కాంగ్రెస్ పార్టీ.. ఆత్మపరిశీలన మొదలుపెట్టింది. ఈ క్రమంలో ఏఐసీసీ నాయకత్వంలో మార్పులు, చేర్పులకు శ్రీకారం చుట్టింది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి నాయకత్వ మార్పులను ప్రకటించేందుకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ కసరత్తు చేస్తున్నారు. మార్పుల్లో భాగంగా వాయనాడ్ ఎంపీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంక వాద్రాకు కీలక బాధ్యతలు అప్పగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. గత ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో 99 సీట్లు సాధించిన అనంతరం కాంగ్రెస్ పార్టీ నాయకత్వం.. పూర్వవైభవం దిశగా దూసుకెళ్తున్నామని భావించింది. కానీ ఆ విజయానికి ఇండి కూటమిలో 30కి పైగా పార్టీల బలం తోడైందని గ్రహించలేకపోయింది. ఆ వెంటనే జరిగిన కొన్ని రాష్ట్రాల ఎన్నికల్లో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసిన జమ్ము-కాశ్మీర్, జారండ్ రాష్ట్రాల్లో విజయం సాధించగా.. ఒంటరిగా పోటీ చేసిన హర్యానాలో చతికిలపడింది. మహారాష్ట్రలో మిత్రపక్షాలతో కలిసి పోటీ చేసినప్పటికీ ప్రత్యర్థి కూటమిని ఎదుర్కోలేకపోయింది. తాజాగా ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో సైతం ఒంటరి పోరుతో కనీసం ఒక్క సీటు కూడా గెలవలేకపోయింది. 2015 నుంచి ఢిల్లీలో జరిగిన వరుస మూడు ఎన్నికల్లో కాంగ్రెస్ ఖాతాయే తెరవలేకపోయింది.నిలకడగా పేలవమైన ప్రదర్శన చూపిస్తున్న కాంగ్రెస్ పార్టీలో నాయకత్వ మార్పు అవసరమని అగ్రనేతలు భావిస్తున్నారు. మరికొన్ని మాసాల్లో బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఏడాది(2026) అస్సాం, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, పుదుచ్చేరి, కేరళ రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికలకు పార్టీని సన్నద్ధం చేసేందుకు ఏఐసీసీలో కీలక మార్పులు, చేర్పుల అత్యవసరం కావడంతో ఆ దిశగా కాంగ్రెస్ అధిష్టానం కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే మధ్య అనేక రౌండ్ల సమావేశాలు జరిగాయి. కొన్ని



సమావేశాల్లో ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కూడా ఉన్నారు.

### వేణుగోపాల్ బాధ్యతల వికేంద్రీకరణ

కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో "ఆలిండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడి తర్వాత అత్యంత శక్తివంతమైన పదవి ఏదైనా ఉందంటే అది సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి పదవే. ప్రస్తుతం కేసీ వేణుగోపాల్ ఆ బాధ్యతలు నెరవేర్చుతున్నారు. అలాగే పొలిటికల్ అఫైర్స్ కమిటీ కి కూడా చైర్మన్‌గా ఉన్నారు. ఈ రెండింటిలో ఒక బాధ్యతను మరొకరికి అప్పగించే అవకాశం ఉందని పార్టీ వర్గాల సమాచారం. అయితే, కేరళ కాంగ్రెస్ ఎన్నికల బాధ్యతలు చేపట్టే వరకు ఆయన తన పదవిలో కొనసాగవచ్చని తెలిసింది.

### తెలంగాణ ఇంఛార్జ్ మార్పు..?

ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి పదవుల్లోకి మరో నలుగురు లేదా ఐదుగురిని కొత్తగా తీసుకునే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అదే సమయంలో ఇప్పటికే ప్రధాన కార్యదర్శులుగా ఉన్నవారిలో కొందరిని తొలగించే అవకాశం కూడా లేకపోలేదు. వారి పనితీరు ఆధారంగా ఈ మార్పులు, చేర్పులు ఉంటాయి. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు వివిధ రాష్ట్రాలకు ఇంచార్జులుగా వ్యవహరిస్తుంటారన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం తెలంగాణతో పాటు బిహార్, రాజస్థాన్, హర్యానా, పంజాబ్, అస్సాం రాష్ట్రాల ఇంచార్జుల మార్పులు కూడా ఉంటాయని ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి.

అలాగే మరో 8 రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షులను కూడా మార్చేందుకు కసరత్తు జరుగుతోంది. అధ్యక్ష మార్పు జరిగే రాష్ట్రాల్లో ఒడిశా, మహారాష్ట్ర, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, తమిళనాడు తదితర రాష్ట్రాలున్నాయి. కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌ను అస్సాంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించనున్నట్టు తెలిసింది. కర్ణాటకలో కూడా డీకే శివకుమార్ ఉప ముఖ్యమంత్రిగా, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండు బాధ్యతల్లో కొనసాగుతున్నారు. వీటిలో పార్టీ అధ్యక్ష బాధ్యతల్ని మరొకరికి అప్పగించవచ్చు. జారండ్ ఇన్‌ఛార్జ్ గులాం అహ్మద్ మీర్‌ను ఆయన సొంత రాష్ట్రం జమ్మూ కాశ్మీర్‌కు పంపించే అవకాశాలున్నాయి.

### ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా గిడుగు రుద్రరాజు?

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (APCC) అధ్యక్షుడిగా వైఎస్ షర్మిల కంటే ముందు పనిచేసిన గిడుగు రుద్రరాజును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా తీసుకునే అవకాశం ఉంది. ఆయన ఇది వరకు ఏఐసీసీ కార్యదర్శిగా ఒడిశా రాష్ట్ర కో-ఇంచార్జి బాధ్యతల్ని నిర్వహించారు. విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగంలో ఉన్న రుద్రరాజును ఏఐసీసీ ప్రధాన కార్యదర్శిగా తీసుకుని ఏదో ఒక రాష్ట్ర బాధ్యతల్ని అప్పగిస్తారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

### ప్రియాంక గాంధీ వాద్రాకు కీలక పదవి?

అలాగే వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పార్టీలో ప్రధాన కార్యదర్శి పదవిలో ఉన్నారు. గతంలో ఉత్తర్ ప్రదేశ్ ఇంచార్జిగా వ్యవహరించిన ఆమెకు ప్రస్తుతం ఏ బాధ్యతలూ లేవు. ఈ పరిస్థితుల్లో ప్రియాంకకు మార్పులు, చేర్పుల్లో భాగంగా కీలక బాధ్యతలు అప్పగిస్తారని విస్తృతంగా చర్చ జరుగుతోంది. ఏదైనా ఒక రాష్ట్ర ఇంచార్జిగా లేదా ఎన్నికల నిర్వహణ / ప్రచార కమిటీ బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నట్టు పార్టీ నేతలు ఊహిస్తున్నారు.అటు పార్టీ హైకమాండ్‌కు సన్నిహితులుగా భావిస్తున్న బీకే హరిప్రసాద్, సచిన్ రావు, మీనాక్షి నటరాజన్, బీవీ శ్రీనివాస్, పర్గత్ సింగ్, అజయ్ కుమార్ లల్లు, హరీష్ చౌదరి, జిగ్నేష్ మేవాని, కృష్ణ అలవారు, మహ్మద్ జావేద్, అభిషేక్ దత్, ప్రకాష్ జోషి, గణేష్ గొడియాల్ వంటి అనేక మంది నాయకులకు ముఖ్యమైన బాధ్యతలు అప్పగించవచ్చని తెలుస్తోంది. అలాగే రణదీప్ సింగ్ సుర్జేవాలా, భూపేశ్ భగేల్, టీఎస్ సింగ్ దేవ్, భన్వర్ జితేంద్ర సింగ్ లేదా అశోక్ గెహ్లాట్ కూడా పార్టీలో కొత్త బాధ్యతలు అప్పగించవచ్చని చర్చ జరుగుతోంది. ఏఐసీసీ కమ్యూనికేషన్స్ విభాగం సెక్రటరీ జనరల్ జైరామ్ రమేష్ స్థానంలో మరొకరిని నియమించాలని కూడా పార్టీ భావిస్తోంది. అయితే సీనియారిటీ పరంగా ఆయనకు మరో ప్రత్యామ్నాయాన్ని హైకమాండ్ ఇప్పటి వరకు గుర్తించలేకపోయింది. దీంతో మరికొన్నాళ్లు ఆయన్ను ఈ బాధ్యతల్లో కొనసాగించవచ్చని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.



## తలపతి విజయ్‌కి భద్రత పెంచిన కేంద్ర ప్రభుత్వం

**టీ మీడియా, ఫిబ్రవరి 14, చెన్నై:**

గతేడాది పొలిటికల్ ఎంట్రీ ఇచ్చిన తలపతి విజయ్.. ఇటీవలె జనంలోకి వచ్చి ప్రజా సమస్యలపై పోరాటం మొదలుపెట్టారు. ఈ క్రమంలో ఆయనకు కేంద్ర ప్రభుత్వం వై కేటగిరీ భద్రత కల్పించింది. తమిళనాడులో ఈ కేటగిరీ భద్రత కేవలం ఆయనకు మాత్రమే కల్పించడం విశేషం. దానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి..

తమిళ స్టార్ నటుడు, ఇటీవలె రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన తలపతి విజయ్‌కి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక భద్రత కల్పిస్తూ ఆదేశలు జారీ చేసింది. విజయ్‌కి వై కేటగిరీ సెక్యూరిటీని కేటాయించింది. ఈ వై కేటగిరీ సెక్యూరిటీలో మొత్తం 8 మంది ఉండనున్నారు. గతేడాది తమిళగ వెంట్రీ కళగం పేరుతో రాజకీయ పార్టీ పెట్టిన విజయ్.. ఇటీవలె జనంలోకి రావడం మొదలుపెట్టారు. దీంతో విజయ్‌కి భద్రత కల్పించింది కేంద్ర ప్రభుత్వం. తమిళనాడులో వై కేటగిరీ సెక్యూరిటీ కేవలం విజయ్‌కి మాత్రమే ఉండటం గమనార్హం. అయితే ఈ వై కేటగిరీ సెక్యూరిటీలో ఒకరిద్దరు ఎన్ఎస్‌జీ (నేషనల్ సెక్యూరిటీ గార్డ్) కమాండోస్ ఉంటారు. మిగతా వాళ్లు పోలీస్ అధికారులు ఉంటారు. ఈ సెక్యూరిటీ సాధారణంగా ప్రాణహాని ఉన్న ప్రముఖ వ్యక్తులకు కల్పిస్తారు.

### ఎన్ని రకాల సెక్యూరిటీస్ ఉంటాయి..

కేంద్రం కల్పించే ప్రత్యేక భద్రతలో మొత్తం నాలుగు రకాలు ఉంటాయి. అవి ఎక్స్, వై, జెడ్, జెడ్ ప్లస్ గా విభజిస్తారు. వ్యక్తుల హోదా, వారికి ఉండే థ్రెట్స్ ఆధారంగా ఈ నాలుగు రకాల సెక్యూరిటీలో ఒకదాన్ని కేటాయిస్తారు. దీని కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా ఖర్చు పెడుతుంది. కాగా, ఈ నాలుగు కేటగిరీల్లో ఎక్స్ కేటగిరీ బేసిక్ లెవల్. ఇందులో ఇద్దరు సాయుధ సివిల్ పోలీసులు ఉంటారు. 8 గంటల డ్యూటీ రూల్‌తో మొత్తం ఆరుగురు షిఫ్ట్‌ల వారిగా సెక్యూరిటీ ఇస్తారు. ఇక వై గురించి ఆల్రెడీ పైన చెప్పుకున్నాం. వై తర్వాత జెడ్ కేటగిరీ వస్తుంది. ఇందులో మొత్తం 22 మంది ఉంటారు. వీరిలో 4 నుంచి 5 మంది ఎన్ఎస్‌జీ కమాడోలు ఉంటారు. మిగతా వాళ్లు పోలీసు అధికారులు. ఈ జెడ్ కేటగిరీలో ఎస్కార్ట్ వాహనం కూడా కల్పిస్తారు. ఇక నాలుగు కేటగిరీల్లో హై లెవల్.. జెడ్ ప్లస్ కేటగిరీ. ఇందులో పటిష్టమైన భద్రత ఉంటుంది. మొత్తం 55 మంది ఉంటారు. ఈ 55 మందిలో 10 ఎన్ఎస్‌జీ కమాడోలు ఉంటారు. ఈ జెడ్ ప్లస్ కేటగిరీని ప్రభుత్వంలో ఉన్నత హోదాలో ఉన్న వారికి లేదా ఉగ్రవాదులు, సంఘవిద్రోహక శక్తుల నుంచి తీవ్ర ప్రాణహాని ఉన్న వారికి మాత్రమే కల్పిస్తారు. ఈ జెడ్ ప్లస్ సెక్యూరిటీకి కొన్ని సందర్భాల్లో ఎస్పీజీ(స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్) కూడా మద్దతు ఇస్తుంది. సాధారణంగా ప్రధాన మంత్రికి ఈ ఎస్పీజీ సెక్యూరిటీ కల్పిస్తారు.

## ఉపాధి కల్పించేలా పర్యాటకం ఉండాలి

- సీఎం రేవంత్‌రెడ్డిఆదేశాలు

**టి మీడియా, ఫిబ్రవరి 14,హైదరాబాద్ బ్యూరో :**

రాష్ట్రానికి ఆదాయం సమకూరడంతో పాటు యువతకు ఉపాధి కల్పించే ఆదాయ వనరుగా పర్యాటకశాఖ ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. పర్యాటకులను ఆకర్షించే వనరులు మనకు ఎన్నో ఉన్నా.. గతంలో ప్రచారంపైనా శ్రద్ధ చూపకపోవడం, వినూత్న పద్ధతిలో ఆలోచించకపోవడంతో ఈ రంగంలో ఆశించిన ప్రగతి కనిపించడం లేదన్నారు. తెలంగాణ ఘన చరిత్రను వర్తమానానికి అనుసంధానిస్తూ.. భవిష్యత్‌కు బాటలు వేసేలా పర్యాటక శాఖను తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. పర్యాటక శాఖపై ఐసీసీసీలో సీఎం రేవంత్ సమీక్ష నిర్వహించారు. సెమీ అర్బన్, గ్రామీణ ప్రాంతాల్లో పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టేవారికి ప్రోత్సాహకాలు కల్పించాలని సూచించారు. సాగర్ బ్యాక్ వాటర్‌లో బోట్ హౌస్ అందుబాటులో ఉంచాలని..



డిసెస్టినేషన్ వెడ్డింగ్‌లకు తెలంగాణను వేదికగా మార్చాలని సీఎం చెప్పారు.ఆలయాలు, పులుల అభయారణ్యాలకు పర్యాటకంలో ప్రత్యేక ప్రాధాన్యం ఉందని.. ఆ దిశలో దృష్టి సారించి.. అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భద్రాచలం, సలేశ్వరం, రామప్ప ఆలయాలు, మల్లెల తీర్థం, బొగత జలపాతాలు, బౌద్ధ స్తూపాలు, జైనా ఆలయాలు ఇలా ప్రతి ఒక్క పర్యాటక ప్రదేశంలో వసతులు మెరుగుపర్చడంతో పాటు సరైన ప్రచారం కల్పించాలని సూచించారు. భువనగిరి కోట రోప్‌వే పనులపై ఆరా తీశారు. పర్యాటక శాఖ పాలసీకి తుది రూపు ఇచ్చే సమయంలో అటవీ, ఐటీ, విద్యుత్, టీజీ ఐఐసీ, వైద్య, క్రీడల శాఖలతో సమన్వయం చేసుకోవాలని.. ఒకశాఖ విధానాలు మరో శాఖ విధానాలకు ఆటంకం కలుగకుండా జాగ్రత్తలు వహించాలని చెప్పారు. సమీక్షలో మంత్రి జూపల్లి కృష్ణారావు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, సీఎస్ శాంతి కుమారి, సలహాదారు శ్రీనివాసరాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వీ శేషాద్రి, చంద్రశేఖర్‌రెడ్డి, సీఎం సంయుక్త కార్యదర్శి సంగీత సత్యనారాయణ, పర్యాటక శాఖ కార్యదర్శి స్మితా సబర్వాల్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.



## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ

- సంక్షేమ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్ష
- డైట్ బకాయిలు చెల్లించాలని ఆదేశం

**టి మీడియా, ఫిబ్రవరి 14, అమరావతి**

బీసీలను హత్య చేసిన వారిపై విచారణ వేగవంతం చేసి నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ అంశాన్ని తమ మేనిఫెస్టోలో కూడా పొందుపరిచామని, అవసరమైతే ప్రత్యేక కమిషన్ కూడా ఏర్పాటు చేస్తామన్నారు. సచివాలయంలో బీసీ సంక్షేమశాఖపై సమీక్షించిన సీఎం వివిధ అంశాలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. సబ్ కమిటీ నివేదిక రాగానే బీసీ రక్షణ చట్టాన్ని అమల్లోకి తెస్తామన్నారు. రాష్ట్రంలో 2014-19 మధ్య నాటి టీడీపీ ప్రభుత్వం జిల్లా కేంద్రాల్లో 13 కాపు భవనాలను మంజూరు చేసిందని అందులో 5 భవనాల నిర్మాణాలను ప్రారంభించామని మిగిలిన వాటిని గత ప్రభుత్వం నిలిపేసిందన్నారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్మాణాలను పూర్తి చేసేందుకు నిధులు విడుదల చేసిందని తెలిపారు. అవి త్వరలోనే వినియోగంలోకి రానున్నాయని అధికారులు సీఎంకు వివరించారు. నిర్మాణంలో ఉన్న 42 కాపు కమ్యూనిటీ హాళ్లు కూడా వేగంగా పూర్తి చేయాలని సీఎం ఆదేశించారు. బీసీ విద్యార్థుల కోసం ప్రభుత్వం తీసుకునే చర్యలతో స్పష్టమైన మార్పులు రావాలని, ప్రభుత్వం చేసే ఖర్చుకు జవాబుదారీతనం కనిపించాలని సీఎం అన్నారు. రాష్ట్రంలోని 660 గవర్నమెంట్ హాస్టల్స్‌లో 13.10 కోట్లతో చేపట్టిన మరమ్మతులు మరో 6 వారాల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు.

**బిల్లులు చెల్లించాలని ఆదేశం**

విద్యార్థులకు గత ప్రభుత్వం ట్రంక్ పెట్టెలు, ప్లేట్లు, గ్లాసులు, కిచెన్ ఐటెమ్స్ అందించలేదని, 18 కోట్లతో వాటి పంపిణీకి చర్యలు తీసుకున్నామని అధికారులు వివరించగా ఈ ప్రక్రియ మార్చి 3వ వారం నాటికి పూర్తవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ట్యూటర్ల గౌరవ వేతనానికి సంబంధించి 485 హాస్టళ్లలో 2024 మార్చి వరకు గత ప్రభుత్వం పెట్టిన 2.02 కోట్ల బకాయిలు, ఈ ఏడాది ఫిబ్రవరి

మిగతా 3లో..

## పార్టీ కోసం పనిచేసిన వారికి టిక్కెట్లు

- సీఎం రేవంత్ రెడ్డి హామీ

**టి మీడియా, ఫిబ్రవరి 14,హైదరాబాద్ బ్యూరో :**

ప్రతి పేదవాడు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తున్నామని, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్‌పై ఉందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత ఎక్కువగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గాంధీభవన్‌లో జరిగిన యువజన కాంగ్రెస్ నేతల ప్రమాణస్వీకార కార్యక్రమానికి రేవంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.కోసం పోరాడిన అందరికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు ఇస్తామని హామీ ఇచ్చారు. 37 కార్పొరేషన్లకు ఛైర్మన్లు, అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమించామని, పార్టీలో కష్టపడితే తప్పకుండా ఫలితం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడకుండా కేవలం నాయకుల చుట్టూ తిరిగితే మాత్రం పదవులు ఉండవని వెల్లడించారు. గల్లీ నుంచి పోరాడితేనే ఢిల్లీ వరకు ఎదిగే అవకాశం వస్తుందని, కేవలం డబ్బులతోనే రాజకీయాల్లో విజయం సాధిస్తామని అనుకోవద్దని అన్నారు. డబ్బుతోనే గెలిచేది ఉంటే కేసీఆర్‌కు వంద సీట్లు వచ్చి



ఉండేవని, కేసీఆర్ లారీల్లో డబ్బు తరలించినా బీఆర్ఎస్‌ను ప్రజలు ఓడించారని, ప్రజల్లో ఉండి సమస్యలపై పోరాడితేనే ప్రజలు ఆదరిస్తారని రేవంత్? రెడ్డి వివరించారు. పదేళ్ల ప్రజలను పట్టించుకోని బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు ఊర్ల మీద పడ్డారని ఎద్దేవా చేశారు.

**తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దు**

తొలి ఏడాదిలోనే 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తు చేశారు. తొలి ఏడాదిలోనే రూ.2 లక్షల రుణమాఫీ చేసి చూపించామని, తొలి ఏడాదిలోనే 26 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసి చూపించామని, ఎస్సీ వర్గీకరణ కోసం 35 ఏళ్ల పోరాటం

మిగతా 3లో..

## మోడీ కులం బీసీ కన్వర్టెడ్

- సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు


**టి మీడియా, ఫిబ్రవరి 14,హైదరాబాద్ :**

ప్రధాని నరేంద్ర మోడీ కులంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం గాంధీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్రధాని మోడీ బీసీ కాదని.. కన్వర్టెడ్ అని అన్నారు. 2002 వరకు ఉన్నత వర్గాల్లో మోడీ ఉండేవాళ్లని.. మోడీ సీఎం అయ్యాక ఆయన కులాన్ని బీసీల్లో కలిపారని కీలక వ్యాఖ్యలు చేశారు. తాను ప్రధాని మోడీ కులం గురించి ఆషామాషీగా చెప్పడం లేదు.. అన్నీ తెలుసుకునే మాట్లాడుతున్నానని అన్నారు. ఇక మీరే ఆలోచించుకోండి అని ప్రజలకు పిలుపునిచ్చారు.తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. పేదల ఆత్మగౌరవం కోసం ఇళ్లు కట్టిస్తున్నాం. డబుల్ బెడ్‌రూమ్ పేరుతో కేసీఆర్ ప్రజలను మోసం చేశారు. ఆయన మోసం చేశారు కాబట్టే ప్రజలు మనకు అధికారం ఇచ్చారు. స్థానిక సంస్థల్లో యూత్ కాంగ్రెస్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. పార్టీ కోసం పనిచేసే వారికే పదవులు ఇస్తాం. ఫ్లెక్సీలు కట్టి దండాలు పెట్టేవారికి పదవులు రావు. ఢిల్లీ నుంచి కాదు.. గల్లీ నుంచి వచ్చిన వారికే పదవులు ఇస్తాం. దేశంలోనే ఎవరూ చేయనంత రుణమాఫీ తెలంగాణ రైతాంగానికి చేశాం. బీఆర్ఎస్ పార్టీ ఒక దొంగల ముఠా అని మండిపడ్డారు. కేటీఆర్, హరీష్ రావు, కవిత, పోచంపల్లి వంటి దొంగలంతా అందులోనే ఉన్నారని హాట్ కామెంట్స్ చేశారు.



# మా శాఖపై కనికరం చూపండి

- పయ్యావుల పేషీకి క్యూ కట్టిన మంత్రులు
- బడ్జెట్ పై ఆర్థిక శాఖ మంత్రి సమీక్షలు



**టి మీడియా, ఫిబ్రవరి 14, అమరావతి :**
2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తొలిసారి ప్రవేశపెట్టనున్న పూర్తిస్థాయి వార్షిక బడ్జెట్ కసరత్తు తుదిదశకు చేరుకుంది. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూనే మేనిఫెస్టోలో అమలు చేయాల్సిన అంశాలు, ఇతర ప్రభుత్వ ప్రాధాన్యతలతో బడ్జెట్ రూపకల్పన పూర్తికావొచ్చింది. సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లుగా బడ్జెట్ రూపకల్పన సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ నెల 28వ తేదీన ఉభయసభల్లో ప్రవేశపెట్టనున్న వార్షిక బడ్జెట్‌కు సంబంధించి ఇప్పటి వరకూ 28 శాఖల సమీక్షలను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పూర్తి చేశారు. బడ్జెట్ రూపకల్పనపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ముమ్మర కసరత్తు కొనసాగిస్తున్నారు. వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులతో ప్రీ-బడ్జెటరీ సమావేశాలు నిర్విరామంగా చేపట్టారు. ఉదయం నుంచి అర్ధరాత్రి వరకు వివిధ శాఖల మంత్రులు, కార్యదర్శులతో సాగిన వరుస భేటీల్లో తమతమ శాఖలకు కావాల్సిన బడ్జెట్ ప్రతిపాదనలను ఆయా శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు ఆర్థిక మంత్రికి సమర్పించారు. ఆయా శాఖలు ఇచ్చిన ముఖ్యమైన బడ్జెట్ ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకోవాలని ఆర్థిక శాఖ ఉన్నతాధికారులకు పయ్యావుల సూచించారు. విద్యా, వైద్యారోగ్య శాఖల్లో కేంద్రం నుంచి నిధుల లభ్యత ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అంశాన్ని ఆర్థిక శాఖ పరిశీలిస్తోంది. కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకునేలా బడ్జెట్ కసరత్తులు చేపడుతున్నారు. ఖర్చు పెట్టిన కేంద్ర నిధులకు యూసీల జారీ ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని మంత్రి పయ్యావుల అధికారులకు సూచించారు. కేంద్రం నుంచి నిధులను రాబట్టుకునేలా కేంద్ర బడ్జెట్‌ను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. ఆర్థిక శాఖ ముందు మంత్రి నారాయణ ప్రతిపాదనలు: ఇప్పటికే దేవాదాయ, క్రీడలు, వ్యవసాయ, పంచాయతీ రాజ్, కాలుష్య నియంత్రణ, సెర్ప్, ఎంఎస్ఎమ్ఈ, మున్సిపల్, రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్, గృహనిర్మాణం, ఐ అండ్ పీఆర్, ఇంధన శాఖలతో పయ్యావుల వరుస సమీక్షలు నిర్వహించారు. మున్సిపల్ శాఖలోని అన్ని విభాగాలకు సంబంధించి మంత్రి నారాయణ ఆర్థిక శాఖ ముందు ప్రతిపాదనలు ఉంచారు. అమరావతితో పాటు పట్టణాల అభివృద్ధికి సంబంధించిన కీలక శాఖ కావడంతో కేటాయింపుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. అత్యంత కీలకమైన విద్యుత్ శాఖకు కేటాయింపుల పరంగా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి గొట్టిపాటి రవి పయ్యావులను కోరారు. విద్యుత్ శాఖ అనుబంధ విభాగాలకు సంబంధించిన కేటాయింపుల ప్రతిపాదనలను ఈ సందర్భంగా ఆర్థిక శాఖ అధికారులకు అందజేశారు. మేనిఫెస్టో హామీలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయింపులు ఉండాలన్న సీఎం చంద్రబాబు ఆదేశాల ప్రకారం కేటాయింపులు జరగాలని మంత్రి గొట్టిపాటి కోరారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన రీసర్వే ఇతర ప్రాజెక్టుల కోసం కేటాయింపులు చేయాల్సిందిగా రెవెన్యూ శాఖ కోరింది. కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 2025-26 బడ్జెట్ ప్రతిపాదనలపై ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాఖల వారీ సమీక్షలు కొనసాగుతున్నాయి. నేడు (శుక్రవారం) పరిశ్రమలు, హెూం, పౌరసరఫరాల శాఖల మంత్రులతో పయ్యావుల సమావేశం కానున్నారు. తమ తమ శాఖల కేటాయింపులపై టీజీ భరత్, అనిత, నాదెండ్ల మనోహర్?లు ఆర్థిక మంత్రికి ప్రతిపాదనలు అందజేయనున్నారు.

# చట్టాలు రూపొందించాలని కోర్టులు ఆదేశించలేవు

- స్పష్టం చేసిన సుప్రీంకోర్టు



**టి మీడియా, ఫిబ్రవరి 14, ఢిల్లీ: :**
ఒక నిర్దిష్ట పద్ధతిలో చట్టాన్ని రూపొందించాలని శాసనసభను కోర్టులు ఆదేశించలేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్లమెంటు ప్రతి అంశాన్ని పరిశీలించిన తర్వాతే కొత్త చట్టాన్ని రూపొందించిందని, అసలు అధికార పరిధిలో హైకోర్టు, అత్యున్నత న్యాయస్థానం శాసనసభను శాసనం చేయాలని ఆదేశించలేవని తెలిపింది. ఢిల్లీ హైకోర్టు గతేడాది ఫిబ్రవరిలో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జస్టిస్ బీఆర్ గవాయ్, అగస్టిన్ జార్జ్ మాసిహ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఈ పిటిషన్‌ను కొట్టి వేసిన బెంచ్ పై వ్యాఖ్యలు చేసింది. ఫిర్యాదుదారునికి, బాధితుడికి చార్జిషీట్ కాపీని ఉచితంగా అందించాలని జిల్లా కోర్టులు, పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని పిటిషనర్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర తరఫున హాజరైన న్యాయవాది మాట్లాడుతూ భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (%దీచీూ%), 2023 సెక్షన్ 230 ను ప్రస్తావిస్తూ, పిటిషన్ అసంబద్ధమైందని తెలిపారు. పోలీసు నివేదికపై విచారణ ప్రారంభించిన ఏ సందర్భంలోనైనా, నిందితుడికి, బాధితుడికి మేజిస్ట్రేట్ ఉచితంగా సంబంధిత కాపీలు అందించాలని సెక్షన్ 230 నిర్దేశిస్తుందని వెల్లడించారు. వాదనలు విన్న ధర్మాసనం పిటిషన్‌ను కొట్టి వేసింది. కాగా, అన్ని జిల్లా కోర్టులు, పోలీస్ స్టేషన్లు చార్జిషీట్ తుది నివేదిక కాపీని ఫిర్యాదుదారు, బాధితునికి ఉచితంగా అందించాలని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేయగా కోర్టు కొట్టే వేసింది. దీంతో పిటిషనర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

# తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ

- డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
మోడీ సర్కార్ కు తెలంగాణ ప్రజాగ్రహం తప్పదు. కేంద్రం వివక్షతపై దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాల్సిందే. కేంద్ర ప్రభుత్వానిది ఒంటెద్దు పోకడ. తెలంగాణపై కేంద్రం సవతి తల్లి ప్రేమ. కేంద్రం నిధులు ఇవ్వదు.. విభజన హామీలు అమలు చేయదు. కేంద్రంపై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం. రాష్ట్రంలో కాంగ్రెస్ 15 వేల కోట్లు మిగులు బడ్జెట్ ఇవ్వగా టీఆర్ఎస్ ఏడున్నర లక్షల కోట్ల అప్పులు మిగిల్చింది. ఈ అంశాన్ని కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఎందుకు చెప్పలేక పోయారు అని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి అరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో రూ. 15,000 వేల కోట్ల మిగులు బడ్జెట్ తో ఉందని, టీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఏడున్నర లక్షల కోట్ల రూపాయలు అప్పులు మిగిల్చిందని చిన్నారెడ్డి చెప్పారు. టీఆర్ఎస్ ప్రభుత్వానికి పాలన చాతకాక రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో నెట్టివేసిందని చిన్నారెడ్డి అన్నారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది టీఆర్ఎస్ ప్రభుత్వం అని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ నేరుగా ఎందుకు చెప్పలేక పోయారని చిన్నారెడ్డి ప్రశ్నించారు. ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఆర్.ఆర్.ఆర్. ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని కోరారు. కేంద్రం వివక్షతపై దక్షిణాది రాష్ట్రాలు ఏకం కావాల్సిందే అని చిన్నారెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్రంపై ఉద్యమ కార్యాచరణను రూపొందించు కోవాల్సిందే అని చిన్నారెడ్డి పేర్కొన్నారు.



## మావోయిస్టుల డంప్‌లు స్వాధీనం

**టి మీడియా, ఫిబ్రవరి 14,హైదరాబాద్ :**
ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో మావోయిస్టులు అమర్చిన డంప్‌లను పోలీసు బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. డంప్‌లో బాంబులు, ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఎస్ఎంబీఎల్ తుపాకులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 5 కిలోల బరువైన ప్రెషర్ బాంబ్, 5 టిఫిన్ ఐఈడీ బాంబులు, 3 ఎలక్ట్రిక్ డిటోనేటర్లు, ఎలక్ట్రికల్ వైర్లు, 2 ఎస్ ఎంబీఎల్ తుపాకులు ఉన్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న బాంబులను నిర్వీర్యం చేసినట్లు మల్కాన్‌గిరి పోలీసు కార్యాలయం ప్రకటించింది. అయితే ఏవోబీలో మావోయిస్టులు నాలుగు చోట్ల డంప్‌లు అమర్చినట్లు పేర్కొంది. భారీగా డంప్ లభ్యమైన నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో పోలీసులు నిఘా పెంచారు. అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.




## పాఠశాలకు అందమైన చిత్రలేఖనం

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు అందమైన చిత్రలేఖనం చేయించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి. విద్యార్థులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాలలో ఉంటూ జ్ఞానాన్ని ఆర్జిస్తు తమ ఆశయ సాధన కోసం కృషి చేస్తుంటారు. అలాంటి పవిత్రమైన ప్రదేశాన్ని పిల్లల ఆశయాలకు అనుగుణంగా వారికి కొత్త ఆలోచనలు, ప్రేరణ కలిగించే విధంగా అందమైన చిత్రలేఖనం చేయించాలి అనుకున్న జిల్లా కలెక్టర్ ఆదర్శ్ హైదారాబాద్ లో ఉండే విజయ్ స్వాతి తో మాట్లాడి అందమైన చిత్ర లేఖనం చేయించారు. అదే విధంగా ప్రభుత్వ వైద్య శాలకు వచ్చే రోగులకు పరిసరాలు అందంగా కనిపించేందుకు వైద్య శాలకు, అదేవిధంగా మెడికల్ కళాశాలకు సైతం ప్రేరణాత్మక చిత్ర లేఖనం చేయిస్తున్నారు. ఇది మన వనపర్తి జిల్లాకు చిరస్మరణీయం లాంటివి.

## ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలు

- జిల్లా పీడీలు మన్యం యాదవ్, షబ్బీర్ లు ఎంపిక





**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
జనవరి 23 ,24 తేదీలలో హైదరాబాదు లోని జింఖానా హాకీ మైదానంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచి ఈనెల 15 నుండి 28 వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడలో జరిగే ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పోటీలకు పెద్దమందడి ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న మన్యం యాదవ్ , సూగురు ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న ఎండి షబ్బీర్ లు ఎంపికయ్యారు. ఎంపికైన ఫిజికల్ డైరెక్టర్ లను వనపర్తి జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘని, వనపర్తి జిల్లా యువజన క్రీడల అధికారి సుధీర్ కుమార్ రెడ్డి , వనపర్తి జిల్లా స్కూల్ గేమ్స్ కార్యదర్శి సురేందర్ రెడ్డి , వనపర్తి జిల్లా హాకీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొలమోని కుమార్ , వనపర్తి జిల్లా హాకీ అసోసియేషన్ కోశాధికారి నిరంజన్ గౌడ్ , పెద్దమందడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాంతన్న , సూగుర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ , అనిల్ కుమార్ పిడి , పాఠశాల ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సాయం



**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
నాయి బ్రాహ్మణ నాయకులు పశు పుల.వెంకటేష్ (కోకిల) మాతృమూర్తి ముత్యాలమ్మ మరణించిన విషయం సంఘ పెద్దలు తెలుపగా స్పందించిన రావుల చంద్రశేఖరరెడ్డి మాజీ ఎం.పి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపి అంత్యక్రియల కోసం 5000/- రూపాయలు అందించారు. నివాళులు అర్పించిన వారిలో బి.ఆర్.ఎస్ నాయకులు నందిమల్ల.అశోక్, సదుర్ల.రమేష్ నాయి బ్రాహ్మణ నాయకులు సదుర్ల. చిన్నా, ఆంజనేయులు, మోహన్,సంపత్, ఆనంద్, శ్రీనివాసులు ఉన్నారు.

## పూలమాలతో ఘన నివాళులు



**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
నాయి బ్రాహ్మణ నాయకులు పశు పుల.వెంకటేష్ (కోకిల) మాతృమూర్తి ముత్యాలమ్మ మరణించిన విషయం సంఘ పెద్దలు తెలుపగా కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపి పూలమాలలతో ఘన నివాళులు అర్పించిన కోకిల వెంకటేష్, వజ్రాల రమేష్ , డప్పు స్వామి, తదితరులు పాల్గొన్నారు.



## మల్లన్నసాగర్ కాలువకు గండి

- దుండగుల పనేనని అనుమానాలు

**టి మీడియా, ఫిబ్రవరి 14, :**
సిద్దిపేట జిల్లా దుబ్బాక పురపాలికలోని మల్లయ్య పల్లి శివారులో మల్లన్న సాగర్ జలాశయ 14.5 కిలోమీటర్ల ఉప కాలువ 4 ఎల్ డిస్ట్రిబ్యూటరీ కాలువకు గండి పడింది. కాలువ నీటి ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఫలితంగా యాసంగి కోసం వదిలిన గోదావరి జలాలు వృథాగా పోతున్నాయి. యాసంగి సీజన్‌లో సాగునీరు అందించడానికి ప్రభుత్వం ఇటీవల నీటిని విడుదల చేసింది. ఈ క్రమంలో బలవంతపూర్, చెల్లాపూర్, మల్లయ్యపల్లి, కమ్మర్ పల్లి, పోతారం, అచ్చుమాయపల్లి, గంభీర్ పూర్ గ్రామాల మీదుగా కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. కాలువను కొంతమంది దుండగులు కావాలనే ధ్వంసం చేశారని ఆయా గ్రామాలకు రైతులు ఆరోపిస్తున్నారు. మరికొంతమంది రైతులు మాత్రం బలహీనమైన ఆనకట్ట, నీటి ప్రవాహం తాకిడికి కాలువ కొట్టుకుపోయిందని వాదిస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడతామన్నారు. గోదావరి నీళ్లు ఉధృతంగా ప్రవహించడంతో దుబ్బాక - మల్లయ్యపల్లి గ్రామాల మీద మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. రాకపోకలను మళ్లించడానికి స్థానిక పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

# బాల సదన్ ను సందర్శించిన జిల్లా కార్యదర్శి వి.రజని




**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
వనపర్తి జిల్లాలోని బాల సదన్ ను గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజిని సందర్శించారు. బాల సదన్ లో ఉన్న పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించడంలో భాగంగా బాల కార్మికుల చట్టం బాల్య వివాహాల చట్టం మోటార్ వెహికల్ యాక్ట్ మరియు ఇతర చట్టాల గురించి క్లుప్తంగా వివరించారు అదే విధంగా పౌరులు అందరు కూడా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.
అదే విధంగా పిల్లలకు పానెల్ అడ్వకేట్ , పారా లీగల్ వాలంటరీస్ అందుబాటులో ఉండాలని ఉద్దేశంతో వారి పేర్లు , ఫోన్ నెంబర్స్ ఉన్న వివరాల చార్ట్ ను బాల సదన్ లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో సఖి లీగల్ కౌన్సిలర్ డి కృష్ణయ్య , సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ కవిత పాల్గొన్నారు.

**రాజీమార్గం రాజా మార్గం**

రాజీమార్గం రాజా మార్గమని రాజీపడి క్రిమినల్ సివిల్ కాంపౌండబుల్ మెయింటెనెన్స్ కేస్ డైవర్స్ కేసులను రాజీతో పరిష్కరించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎంఆర్ సునీత అన్నారు. గురువారం వనపర్తి జిల్లాలో జిల్లా న్యాయస్థానంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సమావేశం లో 8-3- 2025 రోజున లోకదాలత్ నిర్వహించబడుతుంది. కావున శు క్రవారం జిల్లా న్యాయస్థానంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం ఏర్పరిచి అధిక మొత్తంలో కేసులను రాజీపరచాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎమ్మార్ సునీత, జిల్లా సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి వీ రజని తో పాటు బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.



## పుట్టిన రోజు వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
వనపర్తి గంజ్ టెంపుల్ రోడ్డు లో ఉన్న శ్రినిక బ్యాంక్విట్ హాల్ లో వనపర్తి మండలం నాచహల్లి గ్రామానికి చెందిన చరణ్ తేజ , అఖిల కుమార్తె చాన్వి పుట్టిన రోజు వేడుకలకు మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరై చిన్నారిని ఆశీర్వదించారు మాజీ మంత్రి వెంట నందిమల్ల అశోక్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము, మంద రాము, మనోహర్, వెంకటేష్ సాగర్, వజ్రాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**పుట్టుచీర వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి**

బుద్దారం గ్రామ మాజీ ఎం.పి.టి.సి రాచాల.యశోదశేఖర్ గౌడ్ కూతురు తేజశ్రీ పుట్టుచీర వేడుకలు ఘనంగా జరిగాయి. ఇట్టి కార్యక్రమానికి హాజరైన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి చిన్నారి తేజశ్రీని ఆశీర్వదించారు. నిరంజన్ రెడ్డి వెంట నందిమల్ల.అశోక్,గౌడ్ నాయక్,కృష్ణారావు, రాజు,వెంకటస్వామి, శ్రావణ్ కుమార్, అమర్నాథ్ బి.ఆర్.ఎస్ నాయకులు పాల్గొన్నారు.

# గాంధారి ఖిల్లా జాతర

- పోలీస్ సిబ్బందికి ఏసిపి సూచనలు




**టీ మీడియా, ఫిబ్రవరి 14, రామకృష్ణాపూర్:**
బొక్కలగుట్ట గాంధారి ఖిల్లా మైసమ్మ తల్లినీ దర్శనం చేసుకోవడం కోసం,వివిధ గ్రామాల నుండి ప్రతి సంవత్సరం భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి పూజలు చేసి మొక్కులు చెల్లించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఏసీపి మాట్లాడుతూ గాంధారి ఖిల్లా మైసమ్మ తల్లి జాతర శుక్రవారం నుండి ఆదివారం వరకు జరిగే జాతరలో పోలీస్ బందోబస్తుకు వచ్చిన సిబ్బందికి తగు సూచనలను ఇవ్వడం జరిగింది. అలాగే జాతర చివరి రోజున గుట్ట కింద దర్బార్ కూడ జరుగుతుందని చెప్పారు. ఈ జాతర కోసం పోలీస్ డిపార్ట్మెంట్ తరుపున పెద్దసంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామని,జాతరకు వచ్చే భక్తులు పోలీసులకు సహకరించి, నిర్దేశించిన ఏరియాలో మాత్రమే వాహనాలను నిలపాలని కోరారు. గుట్ట మీద అమ్మవారి దర్శనం కోసం వెళ్లే భక్తులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు, భక్తులందరు పోలీసులకు సహకరించి,ప్రశాంతంగా అమ్మవారి దర్శనం చేసుకోవాలనీ ఈ జాతర విజయవంతం అయ్యేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు ఆఫ్జాలోద్దీన్, కుమారస్వామి,శశిధర్ రెడ్డి, ఆర్కెపి ఎస్సై రాజశేఖర్, సబ్-డివిజన్ ఎస్సైలు,సిబ్బంది అందరు పాల్గొన్నారు.

## కుల గణన వర్గీకరణ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

- పాల్గొన్న కొంకి వెంకటేష్



**టీ మీడియా, ఫిబ్రవరి 14, వనపర్తి బ్యూరో :**
తెలంగాణ ప్రభుత్వం సామాజిక,ఆర్థిక,విద్య,ఉపాధి, రాజకీయ మరియు కుల సర్వే పై ప్రజెంటేషన్ తెలంగాణ రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పిలుపు మేరకు వనపర్తి ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి ఆదేశాల మేరకు హైదరాబాద్, గాంధీభవన్ లోని కుల గణన సర్వే పై ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,దీప దాస్ మున్సి, ఉత్తంకుమార్ రెడ్డి దామోదర్ రాజనర్సింహ శాసనమంత్రులు,ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ రాహుల్ గాంధీ సాధారణ ఎన్నికలకు ముందు తెలంగాణాలో మా ప్రభుత్వం ఏర్పడగానే కుల గణన చేస్తాం అని తెలంగాణ ప్రజలకు హామీ ఇవ్వడం జరిగింది. సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల మరియు మిగతా బలహీన వర్గాలకు చెందిన ప్రజల అభ్యున్నతి నిమిత్తం వివిధ సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన, ఉపాది, రాజకీయ అవకాశాల ప్రణాళికలను రూపొందించి అమలుపరచేలా తెలంగాణ మంత్రివర్గం 04.02.2024 తేదీన చేసిన సిఫారసు మేరకు తెలంగాణ రాష్ట్రమంతటా (సామాజిక, ఆర్థిక, విద్యాపరమైన, ఉపాధి, రాజకీయ, కుల సర్వే (కుల గణన) ఒక సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను చేపట్టాలని ఈ సభ ఏకగ్రీవంగా తీర్మానిస్తోంది. రాష్ట్ర స్థాయిలో ప్రణాళిక విభాగం చర్యలు వివరాల గురించి చర్చించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ ఏస్సీ సెల్ అధ్యక్షులు రాజశేఖర్, పెద్దమందడి మాజీ జెడ్పిటిసి కొమ్ము వెంకటస్వామి,గోపాల్ పేట్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ మునిగళ్ళ ప్రవీణ్ కుమార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



## విద్యార్థులకు ఉచితంగా కంటి అద్దాలు

- మంత్రి సత్యకుమార్

**టీ మీడియా, ఫిబ్రవరి 14,అనంతపురం:**
కేంద్రం సహకారంతో రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కంటిచూపుతో ఇబ్బందులు పడుతున్న 20 లక్షల మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించగా, వారిలో 90 వేల మంది విద్యార్థులకు కంటి అద్దాలు అవసరమని గుర్తించామన్నారు. వారందరికీ కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతపురం జిల్లా గార్లదిన్నె మండల కేంద్రం ఏపీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యే శ్రావణి శ్రీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు. 90వేల మంది విద్యార్థులకు పంపిణీ : ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యార్థులకు కంటి చూపుకు సంబంధించిన సమస్యలపై ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ఉచిత కంటి అద్దాలతో పాటు అవసరమైతే కంటికి సంబంధించిన సర్జరీలు కూడా చేస్తామన్నారు. రాష్ట్రంలో కంటి చూపుతో ఇబ్బందులు పడుతున్న 20లక్షల మంది విద్యార్థులను గుర్తించామని వారిలో 90వేల మందికి ఈరోజు కంటి అద్దాలను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇవాళ విద్యార్థుల పాఠశాలలకు వెళ్లి కంటి అద్దాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. అనంతపురం జిల్లా గాలదిన్నెలో 98 మంది విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. రోగాల బారిన పడకుండా చర్యలు : అదేవిధంగా రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఎక్కడైతే ఉందో అక్కడ తప్ప మిగిలన అన్ని ప్రాంతాలలో ఈ ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమం జరిగిందన్నారు. చిన్నపిల్లలు భవిష్యత్తులో 44 రోగాల బారిన పడకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంగన్?వాడీ టీచర్ల ద్వారా ఆరు సంవత్సరాల పిల్లల నుంచి 18 సంవత్సరాల పిల్లల వరకు కంటి పరీక్షలు చేస్తామన్నారు. అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఈ చికిత్సలు నిర్వహిస్తున్నామని మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. ఆరు నెలలకు ఒకసారి వైద్య పరీక్షలు : అనంతరం ఎమ్మెల్యే శ్రావణి శ్రీ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గార్లదిన్నె మండల కేంద్రంలో మోడల్ స్కూల్ పాఠశాల విద్యార్థులకు మంత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి అద్దాలు పంపిణీ చేశామన్నారు. ఆరు నెలలకు ఒకసారి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువుల వల్ల చిన్న వయసులోనే విద్యార్థులు కంటి చూపు కోల్పోతున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో విద్యార్థులకు ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని వెల్లడించారు.

## బర్డ్ ఫ్లూ నివారణకు

# కట్టుదిట్టమైన చర్యలు

• సీఎస్ విజయానంద్

**టీ మీడియా, ఫిబ్రవరి 14, అమరావతి :**

రాష్ట్రంలోని మూడు జిల్లాల్లో కోళ్లకు వ్యాపించిన బర్డ్ ఫ్లూ వ్యాధిని నివారించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని దీనిపై ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ స్పష్టం చేశారు. సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం ద్వారా పరిస్థితిని ఆయన సమీక్షించారు.



### మార్గదర్శకాలు జారీ

వ్యాధి నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చనిపోయిన కోళ్లను సక్రమంగా పూడ్చిపెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లు, పశు సంవర్ధక శాఖల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నియంత్రణపై కేంద్ర ప్రభుత్వం కూడా మార్గదర్శకాలను జారీ చేసిందని వాటిని కలెక్టర్లకు పంపామని ఆ స్టాండర్డ్ ప్రోటోకాల్ మార్గదర్శకాలను తప్పక పాటించాలన్నారు. ఈ మార్గదర్శకాల ప్రకారం వ్యాధి సోకిన ప్రాంతానికి ఒక కిలోమీటరు పరిధిని రెడ్ జోన్ గా ప్రకటించి అక్కడ రాకపోకలను, దాణా రవాణాను నియంత్రించాలని స్పష్టం చేశారు. ఒకటి నుంచి తొమ్మిది కిలోమీటర్ల పరిధిలో ముందస్తు జాగ్రత్తలను చేపట్టాలని ఈ విషయంలో పశుసంవర్ధక శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సీఎస్ ఆదేశించారు. బర్డ్ ఫ్లూ సోకిన ఏలూరు జిల్లా బాదంపూడి, పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరు,కానూరు , ఎన్టిఆర్ జిల్లా గంపలగూడెం ప్రాంతాల్లోని ఐదు ఫ్రౌల్ట్రీల్లో చేపట్టిన చర్యలను కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఏవియన్ ఇన్ఫ్లుఎంజా వైరస్ రాష్ట్రంలో మనుషులకు సోకినట్టు ఇప్పటి వరకూ రిపోర్టు కాలేదని వైద్యారోగ్యశాఖ అధికారులు స్పష్టం చేశారు. అత్యంత అరుదుగా మాత్రమే ఇది మనుషులకు సోకే అవకాశం ఉందని గత ఐదేళ్లలో ఈ వైరస్ దేశంలో మహారాష్ట్ర,హర్యానా,పశ్చిమ బెంగాల్ లాంటి చోట నాలుగు కేసులు మాత్రమే నమోదయ్యాయని తెలిపారు. మరోవైపు ఢిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్సుకు హాజరైన కేంద్ర పశుసంవర్ధక శాఖ కమిషనర్ అభిత్ మిత్రా వ్యాధి సోకిన ప్రాంతాలను రెడ్ జోన్ గా ప్రకటించి చర్యలు చేప్టటాల్సిందిగా సూచనలు చేశారు. ప్రతీ 15 రోజులకు నమూనాలు తీసి నివేదికలు పంపాల్సిందిగా సూచించారు.

## అందరి దృష్టిని ఆకర్షిస్తున్న విద్యార్థి

• 6 అడుగుల 8 అంగులాల పొడవు

**టి మీడియా, ఫిబ్రవరి 14,ఆదిలాబాద్ :**



ఆ విద్యార్థి వయస్సు 15ఏళ్లు. ఊహించని ఎత్తు పెరిగాడు. ఆ ఎత్తే తనకు గుర్తింపు తెస్తోందంటున్నాడు ఆ విద్యార్థి. ఇంతకీ ఆయన ఎలాగా ఉంటాడనేగా మీ సందేహం. ఆలస్యం దేనికి చదివేయండి మరి.ఆదిలాబాద్ పట్టణం బొక్కలగూడ కాలనీకి చెందిన వినోద్-సుజాత దంపతుల పెద్ద కుమారుడు వన్నెల హేమంత్. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. ఆరడుగుల ఎనిమిది అంగుళాల పొడవుతో అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. సాధారణంగా 14-15ఏళ్ల వయస్సులో అబ్బాయిలు 5 నుంచి 5.7అడుగులు ఉంటారు. కానీ హేమంత్ మాత్రం అనూహ్యంగా పెరిగాడు.

**నాతో సెల్ఫీలు తీసుకుంటున్నారు**

తనను చూసి అంతా సెల్ఫీలు తీసుకుంటున్నారని హేమంత్ అంటుండగా ఆయన స్నేహితుడిగా ఉండటం తమకూ గర్వంగా ఉందని సహచరులు చెబుతున్నారు. ధనంజయ్, సహచర విద్యార్థి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆదిలాబాద్ పాఠశాలలో అందరికంటే పొడుగ్గా ఉండటంతో అంతా హేమంత్ చుట్టూ చేరి సందడి చేస్తున్నారు సహచరవిద్యార్థులు. కుమారుడికి తన పోలికే వచ్చిందని హేమంత్ తల్లి సుజాత మురిసిపోతుండగా పాఠశాలలో క్రమశిక్షణ ఉన్న విద్యార్థి అని ఉపాధ్యాయులు చెబుతున్నారు.బడిలో, ఇంటిపక్కన సజ్జల పైన ఏదైనా వస్తువుంటే తననే పిలుస్తారని హేమంత్ చెబుతున్నాడు. స్కూల్? యూనిఫాం సరిపోకపోవడంతో సివిల్? డ్రెస్?లోనే వస్తున్నట్లుగా తెలిపాడు. కాళ్లు పొడవుగా ఉండటం వల్ల సైకిల్? తొక్కడం కష్టంగా ఉందని హేమంత్? అన్నాడు. బస్సులో ప్రయాణం చేసేటప్పుడు చాలా జాగ్రత్తగా వెళ్లాల్సి వస్తోందని అంటున్నాడు. బాగా చదివితే పోలీస్?గా ఉద్యోగం వస్తుందని టీచర్లు ప్రోత్సహిస్తున్నట్లుగా హేమంత్ వివరించారు.

## పార్టీ కోసం పనిచేసిన వారికి టిక్కెట్లు

(మొదటిపేజీ తరువాయి..)

జరిగిందని, ఎందరో ప్రాణాలు అర్పించారని పేర్కొన్నారు. ఇప్పుడు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్న తొలి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని అన్నారు. సోషల్ మీడియాలో విపక్షాలు చేసే తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మొద్దని వెల్లడించారు.

**కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాజీనామా చేయాలి**

కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు సహకరించట్లేదని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. బిహార్, గుజరాత్, ఉత్తర్‌ప్రదేశ్‌కు తప్ప ఎవరికీ నిధులు ఇవ్వట్లేదని ఆరోపించారు. రాష్ట్రానికి ఏమీ సాధించని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మెట్రో ప్రాజెక్టు దస్త్రాన్ని దిల్లీకి పంపితే ఇంతవరకు ఆమోదించలేదని, తాము సొంతంగా చేసుకుంటామని చెప్పినా, మెట్రోకు ఆమోదం తెలుపలేదని అన్నారు. ట్రిపుల్ ఆర్‌ను సగం ఆమోదించి సగం పక్కకు పెట్టారని తెలిపారు.

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ

(మొదటిపేజీ తరువాయి..)

వరకు చెల్లించాల్సి ఉన్న 2.33 కోట్ల బకాయిలు మొత్తం కలిపి 4.35 కోట్లు చెల్లించాలని సీఎం ఆదేశించారు.డైట్ ఛార్జీలకు సంబంధించి 185.27 కోట్లు పెండింగులో ఉన్నట్టు గుర్తించిన సీఎం ప్రస్తుతం అందులో 110.52 కోట్లు చెల్లించేందుకు ఆమోదం తెలిపారు. కాస్మోటిక్ బిల్లులు 29 కోట్లు చెల్లించాలని ఆదేశించారు. అలాగే హాస్టళ్ల విద్యుత్ సరఫరాకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని సూచించారు. సత్యసాయి జిల్లాలోని నసనకోట, ఆత్మకూరు బీసీ సంక్షేమ బాలికల పాఠశాలలను రెసిడెన్షియల్ బీసీ గర్ల్స్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేసేందుకు సీఎం సుముఖత వ్యక్తం చేశారు. కుప్పంలోనూ బీసీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు.34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరణ: బీసీలకు స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు పునరుద్ధరిస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కేబినెట్లోనూ ఆమోదం తెలిపామని, ఈ మేరకు అవసరమైతే న్యాయపోరాటం చేయాల్సి ఉందని తెలిపారు. అలాగే ప్రతి కార్పొరేషన్‌కు దామాషా ప్రకారం నిధులు కేటాయించాలన్నారు. చేనేత వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీకి కట్టుబడి ఉన్నామని, దీనిపై ఇప్పటికే విధివిధానాలు రూపొందించామని తెలిపారు.రజకులకు మేలు చేకూరేలా రాష్ట్రంలో 2014-19 మధ్య నిర్మించిన దోబీ ఘాట్ల మరమ్మతులు, అవసరమైన చోట కొత్తవి నిర్మించడంపై దృష్టి పెట్టాలని సీఎం అన్నారు. బడ్జెట్‌లో కేటాయించే నిధులతో రాష్ట్రంలో బీసీ భవనాలు పూర్తి చేయాలని ఆదేశించారు. 2014 నుంచి బీసీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిపొందిన వారి సమాచారాన్ని సేకరించాలని, వృత్తి ప్రామాణికంగా రుణాలు తీసుకున్న వారు ప్రస్తుతం ఎంతమంది కొనసాగిస్తున్నారో ఆడిట్ చేయాలని ఆదేశించారు.

## తాగునీటిలో చనిపోయిన కోళ్లు..!

**టి మీడియా, ఫిబ్రవరి 14, నల్గొండ :**



నల్గొండలో మరో ఘోరం తాగు నీటిలో మొన్న కోతులు, నిన్న వాటర్ ట్యాంక్‌లో శవం, నేడు చనిపోయిన కోళ్లు దర్శనమిస్తున్నాయి. హైదరాబాద్ తాగు నీటి కోసం ఉపయోగించే అక్కంపల్లి రిజర్వాయర్ లో బర్డ్ ఫ్లూతో మృతి చెందిన వందలాది కోళ్లను పడేశాడు. నల్లగొండ జిల్లా నుంచి కృష్ణా నది వాట్ హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని గ్రామాలకు తాగునీరు సరఫరా చేసే పీ.ఏ పల్లి మండలంలోని అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో 80 కోళ్లు మృతి చెందిన ఘటన కలకలం రేపుతుంది. రిజర్వాయర్లో పెద్ద మొత్తంలో చనిపోయిన కోళ్లు వేశారని నిన్నటి నుంచి సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ గా మారింది. ప్రస్తుతం బర్డ్ ఫ్లూ వార్తల నేపథ్యంలో రిజర్వాయర్ లో మృతి చెందిన కోళ్ల ఘటన ఆందోళనకు గురి చేస్తుంది. దీంతో నితో అప్రమత్తమైన అధికారులు శుక్రవారం రిజర్వాయర్ ను పరిశీలించారు. చనిపోయిన కోళ్లు, వాటి వ్యర్థాలు వేశారనే నేపథ్యంలో రిజర్వాయర్ను ఇరిగేషన్ అధికారులతో కలిసి దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి పరిశీలించారు రిజర్వాయర్ వెనక జలాలలో దాదాపు 80 కోళ్ల లభ్యం అయ్యాయి. వీటిని స్థానిక రెవిన్యూ సిబ్బందితో బయటికి తీసి రిజర్వాయర్ మొత్తం పరిశీలిస్తున్నారు. రిజర్వాయర్లో కోళ్లను ఎవరు వేశారు అనే కోణంలో విచారణ చేపడుతున్నామని ఆర్డీఓ వెల్లడించారు.

## యాసిడ్ దాడి బాధితురాలిని బెంగళూరుకు తరలింపు

**టి మీడియా, ఫిబ్రవరి 14, అన్నమయ్య :**



జిల్లాలో యాసిడ్ దాడికి, లైంగికదాడికి గురైన బాధితురాలిని ఏపీ అధికారులు బెంగళూరుకు తరలిస్తున్నారు. బాధితురాలిని మొదట మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు.. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు బెంగళూరుకు తరలించాలని సూచించారు. మెరుగైన వైద్యం అందించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో బాధితురాలిని అధికారులు బెంగళూరుకు తరలిస్తున్నారు. తన ప్రేమను అంగీకరించలేదని, వేరే వ్యక్తిని పెళ్లి చేసుకోబోతోందనే కోపంతో గణేశ్ అనే యువకుడు ఓ యువతిపై దాడి చేశాడు. యువతి నోట్లో యాసిడ్ పోసి, కత్తితో తలపై విచక్షణరహితంగా పొడిచాడు. బాధతో కేకలు పెడుతున్న బాధితురాలిపై పైశాచికంగా అత్యాచారం చేశాడు. అనంతరం ఘటనా స్థలం నుంచి పారిపోయాడు. ఈ ఘటనపై ప్రభుత్వం సీరియస్ గా స్పందించింది. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. సీఎం సూచనలతో హోంమంత్రి అనిత బాధితురాలి తల్లిదండ్రులతో మాట్లాడారు. బాధితురాలిని బెంగళూరుకు తరలించాలని అధికారులకు సూచించారు. నిందితుడిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని పోలీసులను ఆదేశించారు.

# కారులో ఎక్కించుకొన్నాడు

• నగలపై ఆశపుట్టి హత్య చేశాడు

**టి మీడియా, ఫిబ్రవరి 14,రంగారెడ్డి:**




జిల్లా షాబాద్‌లో జటని సత్తమ్మ అనే మహిళ హత్య కేసును పోలీసులు ఛేదించారు. నగల కోసమే నిందితుడు ఈ హత్యకు పాల్పడ్డట్లు గుర్తించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా మన్మర్రి గ్రామానికి చెందిన సత్తమ్మ షాద్?నగర్?లోని చికిత్స కోసం కంటి ఆసుపత్రికి వెళ్లి తిరిగి రాకపోవడంతో ఆమె భర్త అంజయ్య ఈ నెల 8న పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ఫిబ్రవరి 10న రంగంపల్లి శివారులో మృతదేహాన్ని గుర్తించారు.

**కారు ఎక్కడమే పాపం**

అంజయ్య ఇచ్చిన సమాచారంతో పోల్చిచూడగా ఆ మృతదేహం సత్తమ్మదేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. సీసీకెమెరాలు, సాంకేతిక ఆధారాలతో లోతుగా దర్యాప్తు చేపట్టిన ఎస్?వోటీ పోలీసులు చౌదరిగూడ మండలంలోని కాసులాబాద్‌కు చెందిన వత్యావత్ అనిల్‌కుమార్ ఈ హత్య చేశాడని గుర్తించారు. ఈ నెల 8న అనిల్‌కుమార్ తన కారులో షాద్‌నగర్ వైపు వెళ్తుండగా మార్గమధ్యలో అప్పారెడ్డిగూడకు చెందిన బీబీ అనే మహిళతో పాటు సత్తమ్మ కూడా లింగారెడ్డి గూడ బస్టాప్ వద్ద లిఫ్ట్ అడిగి అనిల్? కారు ఎక్కారు.

**నగలపై పడిన చూపు**

కొంతదూరం వెళ్లాక మొగిలిగిద్ద వద్ద బీబీ అనే మహిళ దిగిపోయారు. షాద్‌నగర్ కంటి ఆస్పత్రికి వెళ్తున్న సత్తమ్మ కారులోనే ఉండిపోయారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నిందితుడు సత్తమ్మ ఒంటిపై ఉన్న నగలపై కన్నేశాడు. రంగంపల్లి బస్టాప్ సమీపంలో జనావాసం లేని ప్రాంతానికి తీసుకెళ్లాడు. నగలు ఇవ్వాలంటూ కారులోనే ఆమెపై దాడిచేశాడు. దాంతో సత్తమ్మ సృహ కోల్పోగా, ఆమెను ముళ్లపొదల్లోకి ఈడ్చుకెళ్లి దారుణంగా తలపై రాయితో కొట్టి చంపినట్లు పోలీసులు వెల్లడించారు.ఆభరణాలతో పరార్ : అనంతరం ఆమె ఒంటిపై ఉన్న దాదాపు అరకిలో వెండి, 5 తులాల బంగారు ఆభరణాలను తీసుకుని నిందితుడు పరారయ్యాడు. సీసీ కెమెరాలను పరిశీలించి, కారు నెంబర్ ఆధారంతో నిందితుడ్ని అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయగా తానే నగల కోసం చేసినట్లు ఒప్పుకున్నాడని పోలీసులు వెల్లడించారు. నిందితుడు అనిల్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.



## ప్రయాగ్‌రాజ్ టు అయోధ్య..

• 4 గంటల సమయానికి 36 గంటలు

**ప్రయాగ్‌రాజ్ టి మీడియా, ఫిబ్రవరి 14,:**

ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. గంగా, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించేందుకు ప్రపంచం నలుమూలల నుంచి అంచనాలకు మించి తరలివస్తున్నారు. దీంతో ప్రయాగ్‌రాజ్ వైపు వెళ్లే దారులన్నీ వాహనాలతో రద్దీగా మారాయి. దాదాపు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. ఇక కుంభమేళా ఎఫెక్ట్‌తో ప్రస్తుతం యూపీలోని ప్రఖ్యాత ఆలయాలన్నీ భక్తులతో కిక్కిరిసిపోతున్నాయి. కుంభమేళాకు వచ్చిన భక్తులు అట్నుంచి అటు కాశీ, అయోధ్య వెళ్తున్నారు. దీంతో ఆయా ఆలయాల్లో సాధారణం కంటే అధిక సంఖ్యలో రద్దీ నెలకొంది. తాజాగా అయోధ్య వెళ్లే దారుల్లో ట్రాఫిక్ జామ్ తలెత్తింది. కాశీలో భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో అంతా అయోధ్య వైపు దారి మళ్లుతున్నారు. దీంతో ప్రయాగ్‌రాజ్ టు అయోధ్య రహదారి వాహనాలతో కిక్కిరిసిపోతోంది. కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. భక్తులు గంటల తరబడి ట్రాఫిక్‌లోనే మగ్గిపోతున్నారు.ప్రయాగ్‌రాజ్ నుంచి అయోధ్యకు 270 కిలోమీటర్ల దూరం ఉంది. సాధారణ సమయంలో మూడు నుంచి నాలుగు గంటల్లో అయోధ్య చేరుకునేవారు. అయితే, కుంభమేళా ఎఫెక్ట్‌తో అయోధ్యకు వెళ్లడానికి దాదాపు 36 గంటలకుపైగా సమయం పడుతోందంట. దీంతో యాత్రికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి రోడ్లపైనే ఉండిపోవాల్సి వస్తోందని.. ఆహారం, నీళ్లు లేక అలమటిస్తున్నట్లు వాపోతున్నారు. కుంభమేళా వేళ అయోధ్యకు వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. రోజూ లక్షల్లో భక్తులు రామ్‌లల్లా దర్శనానికి పోటెత్తుతున్నారు. దీంతో రాముడి దర్శనానికి గంటల సమయం పడుతోంది. మరోవైపు కాశీలోనూ అదే పరిస్థితి ఏర్పడింది.




## కో ఆపరేటివ్ బ్యాంకుపై ఆర్బీఐ ఆంక్షలు

• ఆందోళనతో క్యూకట్టిన ఖాతాదారులు

**టి మీడియా, ఫిబ్రవరి 14,ముంబై:**

కో ఆపరేటివ్ బ్యాంకుపై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. దీంతో ఖాతాదారులు ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో ఆ బ్యాంకు వద్దకు చేరుకున్నారు. తమ డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఆ బ్యాంకు వద్ద గందరగోళం నెలకొన్నది. మహారాష్ట్ర రాజధాని ముంబైలో ఈ సంఘటన జరిగింది. బాంద్రాలోని న్యూ ఇండియా కో-ఆపరేటివ్ బ్యాంక్ పై ఆర్బీఐ ఆంక్షలు విధించింది. ఫిబ్రవరి 13 నుంచి ఆర్బీఐ ముందస్తు అనుమతి లేకుండా బ్యాంకు రుణాలు మంజూరు చేయడం లేదా పునరుద్ధరించడం, పెట్టుబడులు పెట్టడం లేదా కొత్త డిపాజిట్లను స్వీకరించడాన్ని నిషేధించింది.కాగా, ఆ బ్యాంక్ ప్రస్తుత ద్రవ్యత స్థితి దృష్ట్యా పొదుపు లేదా కరెంట్ ఖాతాల నుంచి విత్‌డ్రాలు నిలిపివేయాలని ఆర్బీఐ ఆదేశించింది. నిర్దిష్ట షరతుల ప్రకారం డిపాజిట్లపై రుణాలను ఆఫ్‌సెట్ చేయడానికి అనుమతి ఇచ్చింది. అలాగే ఉద్యోగుల జీతాలు, అద్దె, విద్యుత్ బిల్లులు వంటి ముఖ్యమైన ఖర్చులకు నిధులను వినియోగించవచ్చని తెలిపింది. ఆరు నెలల వరకు ఈ ఆంక్షలు అమలులో ఉంటాయని, ఆ తర్వాత సమీక్షించి నిర్ణయం తీసుకుంటామని ఒక ప్రకటనలో పేర్కొంది.మరోవైపు ఆర్బీఐ ఆంక్షల విషయాన్ని కస్టమర్లకు ఆ బ్యాంకు తెలియజేసింది. దీంతో బ్యాంకు ఖాతాదారులు ఆందోళన చెందారు. పెద్ద సంఖ్యలో అక్కడకు చేరుకున్నారు. తమ డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వృద్ధులు, మహిళలు తమ డిపాజిట్ పత్రాలు వెంటతెచ్చారు. నగదు విత్ డ్రా కోసం క్యూకట్టారు. అయితే బ్యాంకు సిబ్బంది అనుమతించకపోవడంతో కస్టమర్లు ఆందోళన చెందారు. దీంతో ఆ బ్యాంకు వద్ద గందరగోళ పరిస్థితి నెలకొన్నది.

# ఏనుగుల ఘర్షణతో తొక్కిసలాట

• ముగ్గురు మృతి

**టి మీడియా, ఫిబ్రవరి 14, కోజికోడ్ :**

కేరళలో విషాదం చోటు చేసుకుంది. కోజికోడ్ జిల్లాలోని ఓ ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు మృతి చెందారు. మరో 24 మందికి గాయాలయ్యాయి. గురువారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేరళలోని కోజికోడ్ జిల్లాలోని కోయిలాండి సమీపంలో కురవంగడ్‌లోని మనక్కులంగర భగవతి ఆలయ ప్రాంగణంలో వార్షిక ఉత్సవం సందర్భంగా ఆలయ నిర్వాహకులు రెండు ఏనుగుల్ని తీసుకువచ్చారు. ఆ సమయంలో నిర్వాహకులు బాణాసంచా పేల్చడంతో%ా% ఏనుగులు బెదిరిపోయి, జనాన్ని తొక్కుకుంటూ, దాడులు చేస్తూ ఆ ప్రాంతం నుంచి పరుగులు తీశాయి. ఈ దుర్ఘటనలో ముగ్గురు మరణించారు. 24 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని అత్యవసర చికిత్స కోసం ఆస్పత్రికి



తరలించినట్లు పోలీసులు తెలిపారు.కాగా ఈ ఘటనపై కౌన్సిలర్ మాట్లాడుతూ.. 'ఈ దుర్ఘటన గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో జరిగింది. ఉత్సవం చివరి రోజున ఊరేగింపు కోసం ఏనుగులను ప్రదర్శిస్తున్న సమయంలో నిర్వాహకులు పటాకులు పేల్చారు. పటాకుల శబ్దాలతో బెదిరిపోయిన ఒక ఏనుగు మరో ఏనుగుతో ఘర్షణకు దిగింది. ఏనుగుల ఘర్షణతో తాత్కాలికంగా ఏర్పాటు ఉత్సవ కార్యాలయం కూడా కూలిపోయింది. ఆ సమయంలో ఆలయ ప్రాంగణంలో వున్న ప్రజల మధ్య తోపులాట జరిగింది' అని ఆయన అన్నారు. ఇక ఈ ఘటనపై కోయిలాండి ఎమ్మెల్యే కనాతిల్ జమీలా స్పందించారు. తోపులాటలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు ఆయన మీడియాకు వెల్లడించారు. ఇక ఈ సమాచారం అందుకున్న అటవీశాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని ఏనుగులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.